పంట కాలువల్లో పూడికతీత

బోర్లంలో పంటకాలువ పూడిక తీస్తున్న కూలీలు

బాన్సువాడ రూరల్, జూన్ 28 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా పంట కాలువ పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ పనులు జోరందుకోవడంతో పంటకాలువల్లో పూడిక తీయాలని రైతులు ఉపాధి హామీ అధికారులను కోరారు. దీంతో కాలువల్లో పూడిక మట్టి తీయడంతోపాటు కాలువలో చెట్ల పొదలను ఉపాధి కూలీలు తొలగించారు. కాలువలో పూడిక మట్టి తీయడంతో చివరి ఆయకట్టు రైతులకు సైతం పుష్కలంగా నీరు అందుతుందని రైతులు సంతోషం వ్యక్త చేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం సభ్యులు

బాన్సువాడ, జూన్ 28 : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బాన్సువాడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కళాబృందం సభ్యులు ప్రభాకర్ సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి, వాటిని ఏవిధంగా అరికట్టాలో వివరించారు. సైబర్ నేరం జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై అమ్రు, పోలీస్ సిబ్బంది శేషు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాజంపేట్, జూన్ 28 : మండల కేంద్రానికి చెందిన జోగిపేట రంజిత్(25) ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సంపత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేట్‌కు చెందిన రంజిత్ కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇంటి వద్దనే ఉంటున్నాడన్నారు. తరచూ తల్లిదండ్రులతో గొడవ పడేవాడని తెలిపారు. తల్లిదండ్రులు సొంత ఇంట్లో ఉండలేక అదే గ్రామంలో వేరే ఇంట్లో అద్దెకు ఉంటున్నారని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి పక్కన ఉన్న భాస్కర్‌రెడ్డితో మాట్లాడి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడని చెప్పారు. రాత్రి 8 గంటల వరకు కూడా తలుపులు తీయకపోవడంతో భాస్కర్‌రెడ్డి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడన్నారు. ఇంటికి వెళ్లి తలుపులు పగులగొట్టి చూడగా రంజిత్ దూలానికి ఉరేసుకొని మృతి చెందాడన్నారు. తండ్రి జోగిపేట బాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

- అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి
- నూతన చట్టాలపై సిబ్బందికి అవగాహన

మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి

పాల్గొన్న పోలీసులు

కామారెడ్డి, జూన్ 28 : దేశ వ్యాప్తంగా జూలై 1వ తేదీ నుంచి కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త చట్టాల గురించి ప్రతి ఒక్క అధికారి, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.

నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం 2023పై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని అన్నారు. కొత్త చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందని చెప్పారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మదన్‌లాల్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కామారెడ్డి, జూన్ 28 : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు వచ్చిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత ఉన్న వారిని ఎంపిక చేశారు. జాబ్‌మేళాకు జిల్లాలోని నలుమూలాల నుంచి 224 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో 17 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 35 మంది తర్వాతి దశ ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో టాస్క్ కామారెడ్డి, నిజామాబాద్ రిలేషన్షిప్ మేనేజర్ శ్రీనాథ్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు, మనోజ్ కుమార్, టీపీవో గణేశ్, వివిధ కంపెనీల హెచ్ఆర్‌సీలు పాల్గొన్నారు.

జూలై 2, 7వ తేదీల్లో సీల్డ్ టెండర్ల ఓపెన్

కామారెడ్డి, జూన్ 28 : జిల్లా పరిధిలోని తొమ్మిది మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆహార దినుసులు, పండ్లు, కూరగాయలు సరఫరా చేసేందుకు వేసిన సీల్డ్ టెండర్లను జూలై 2, 7వ తేదీల్లో ఓపెన్ చేయనున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ శాఖాధికారి దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటి సరఫరా నిమిత్తం ఈనెల 12 నుం చి 20 వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించినట్లు తెలిపారు. కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్‌కు సంబంధిన టెండర్లు జూలై 5న ఉదయం 11 గంటలకు ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని టెండర్‌దారులు గమనించాలని కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి, జూన్ 28 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడి పెరిగిపోయిందని అన్నారు. జీవో నంబర్ 1 ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు విక్రయించొద్దని, ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ విద్యాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్, జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, కార్యకర్తలు ప్రత్యూష, వరుణ్, వెంకటేశ్, మానస, అల్తాఫ్, శ్రేయ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, జూన్ 28 : విద్యను వ్యాపారం చేసి 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి మోదీ ప్రభుత్వం నెట్టిందని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేరుకు ఎంక్వైరీ కమిషన్ వేస్తున్నామని చెబుతూ ఎన్‌టీఏ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి ఉన్నప్పుడే పేపర్ లీకేజ్ జరిగిందని అన్నారు. పేపర్ లీకేజ్ దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ఐరేని సందీప్, ముదాం అరుణ్, విఠల్, భరత్, ప్రసన్న, సుఫియన్, నితిన్, రాహుల్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పోడియం వితరణ

కామారెడ్డి రూరల్, జూన్ 28 : కామారెడ్డి మండలం షాబ్దీపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పోడియం వితరణ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్యం, క్లబ్ కార్యదర్శి రాజ నర్సింహారెడ్డి, సభ్యులు గడ్డం గంగారెడ్డి, కోడిప్యాక సత్యనారాయణ, సబ్బని కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాగౌడ్, లక్ష్మారెడ్డి, మురళి, సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న విండో చైర్మన్ శ్రీనివాస్

నస్రుల్లాబాద్, జూన్ 28 : మండలంలోని దుర్కి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో బాధితురాలికి చెక్కును విండో చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం అందజేశారు. దుర్కి సహకార సంఘ సభ్యుడు అంకోల్ గ్రామానికి చెందిన మాలోత్ హరి ప్రమాదవశాత్తు నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు పీఎం కిసాన్ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన రూ.లక్ష చెక్కును అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు రాములు, శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్ సందీప్, కార్యదర్శి గంగారాం పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

మాచారెడ్డి, జూన్ 28 : పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన నవదీప్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామస్తులు షబ్బీర్‌అలీ దృష్టికి తీసుకెళ్లాడంతో వెంటనే రూ.90 వేలు విలువచేసే ఎల్వోసీని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు, ఆరెపల్లి మాజీ సర్పంచ్ లింగారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎల్లంపేటలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మాచారెడ్డి, జూన్ 28 : మండలంలోని ఎల్లంపేట, సోమార్‌పేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట వెంకట్రాములు, మండలాధ్యక్షుడు బట్ట రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. ఎల్లంపేట అధ్యక్షుడిగా చుక్కాపురం నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మారుపాక లక్ష్మీనర్సు, ప్రధానకార్యదర్శిగా కొమ్ము కుమార్, సోమార్‌పేట గ్రామ అధ్యక్షుడిగా కట్కూరి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పాతకాల రవి, ప్రధాన కార్యదర్శిగా మెరుగు ప్రకాశ్‌ను ఎన్నుకున్నారు. జూలై 7న వరంగల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ బహిరంగ సభకు భారీ ఎత్తున తరలిరావాలని అన్నారు.

జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

పోచారం వద్ద కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు

నాగిరెడ్డిపేట, జూన్ 28: మండలంలోని పోచారం గ్రామ సమీపంలో ఎన్‌హెచ్765 రహదారి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోచారం వద్ద హైవే అథారిటీ అధికారులు కొలతలు వేసి గుర్తులు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా 15 మీటర్ల చొప్పున భూమిని సేకరించారు. రోడ్డు పక్కన ఉన్న రేకుల షెడ్లు, ఇండ్లను మూడు రోజుల్లో తొలగించుకోవాలని సూచించారు. మట్టి, చెట్లు, ముళ్ల పొదల తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రహదారి పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు, మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

పేదల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాల నిర్వహణ

శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యుడు

లింగంపేట, జూన్ 28: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్యం కోసం వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో పల్లెల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. మండల కేంద్రంలోని దవాఖానలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. లింగంపేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో వంద మందిని పరీక్షించినట్లు తెలిపారు. 18 మందికి ఈసీజీ, 35 మందికి షుగర్, 16 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా వైస్ చైర్మన్ నాగరాజుగౌడ్, కోశాధికారి నరసింహ, ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, మండల శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, వైద్య సిబ్బంది పుష్ప, భీంరాజ్, పద్మ, సందీప్, లలిత, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ముదాం సాయిలు, గుండా బాలకిషన్, నవీన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్/ బిచ్కుంద/ కామారెడ్డి, జూన్ 28: గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ (2), పొలిటికల్ సైన్స్ (1) సబ్జెక్టుల్లో తాత్కాలిక పద్ధతిన పనిచేయడానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టుల్లో 55శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, పీహెచ్‌డీ, నీట్, బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై 1వ తేదీన సాయంత్రంలోపు కాలేజీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 3వ తేదీ ఉదయం 10 గంటలకు కాలేజీలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగులో రెండు, ఇంగ్లిష్‌లో రెండు, గణితంలో ఒకటి, కంప్యూటర్ సైన్స్‌లో ఒక లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు జూలై ఒకటో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు కాలేజీలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఇంటర్వ్యూలను ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జూలై 3వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ మూడు, ఫిజిక్స్ ఒకటి, ఫిషరీస్ ఒకటి, స్టాటిస్టిక్స్ ఒకటి లెక్చరర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని కాలేజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్వ్యూలు జూలై 3వ తేదీన ఉదయం పది గంటలకు ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉంటాయని పేర్కొన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్ల కోసం..

పెద్దకొడప్‌గల్/ రామారెడ్డి, జూన్ 28: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పెద్దకొడప్‌గల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.నళిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రూ.వంద చెల్లించి ఆన్‌లైన్‌లో జూలై 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో జూలై 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరంలో ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి జూలై 12వ తేదీ వరకు గడువు ఉన్నదని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలో అనాథ బాలిక చేరిక

విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రామారెడ్డి, జూన్ 28: మండల కేంద్రంలో భిక్షాటన చేస్తున్న అనాథ బాలికను రామారెడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శుక్రవారం బడిలో చేర్పించుకున్నారు. ప్రస్తుతం బాలిక.. పెద్దమ్మ, పెద్దనాన్న వద్ద ఉంటుందని తెలుసుకొని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పాఠశాలలో చేర్చుకొని ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, యూనిఫామ్‌ను బాలికకు అందజేశారు.

మొక్కలు నాటిన నాయకులు

ఎల్లారెడ్డి రూరల్/ లింగంపేట, జూన్28 : బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 'మాకే నామ్ పే ఏక్ పేడ్' అని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్లారెడ్డి పట్టణంలోని 12వ వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కను నాటి నీళ్లు పోశారు. లింగంపేట మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేసి, ఇండ్ల ఆవరణలో మొక్కలను నాటాలని ప్రజలకు సూచించారు.

పీహెచ్‌సీలో క్లీన్ అండ్ గ్రీన్

లింగంపేట, జూన్ 28: లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను శుక్రవారం తొలగించినట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. లింగంపేట పీహెచ్‌సీని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గురువారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని ఎంపీడీవోతోపాటు పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. దీంతో శుక్రవారం పిచ్చిమొక్కలను తొలగించడంతోపాటు ఆరోగ్యం కేంద్రం ఆవరణను చదును చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు హిమబిందు, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేయిస్తున్న అధికారులు

తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏఐపీకేఎంఎస్ నాయకులు

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తేవాలి

లింగంపేట, జూన్ 27: వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్ మాట్లాడుతూ.. దేశంలో 14కోట్ల మంది వ్యవసాయ కార్మికులు రెక్కల కష్టాన్ని నమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణతో కూలీలు ఉపాధి కోల్పోయి దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉపాధి హామీ పథకంలో నిధుల కోత విధించడంతో కూలీల పరిస్థితి మరింత దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా 6వందల రూపాయలకు కూలి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బాల్‌రాజ్, రైతుకూలీ సంఘం కార్యదర్శి అంబన్న, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, రాపర్తి సాయిలు, శంకర్, చిన్న పెంటయ్య, సాయిలు, వెంకటి, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి చుట్టూ పిచ్చిమొక్కలు.. విద్యార్థినులకు ఇబ్బందులు

నాగిరెడ్డిపేట, జూన్ 28: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నది. పాఠశాలలో 274 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ప్రహరిలోపల చెట్లు, పిచ్చి మొక్కలు పెరగడంతో.. సాయంత్రం ఆరు గంటలు దాటితే చాటు బయటికి రావాలంటే విద్యార్థినులు భయపడుతున్నారు. ఆరుబయట ఆరేసిన బట్టలు సైతం ఉదయం తీసుకెళ్తున్నారు.

అడవిని తలపిస్తున్న కస్తూర్బా పాఠశాల ఆవరణ

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

రామారెడ్డి, జూన్ 28: సదాశివనగర్‌లోని భూంపల్లి ప్రభుత్వ పాఠశాలను మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు లోకేష్‌రావు, ఉపాధ్యాయుడు సాయిలు, ఎస్ఎంసీ డైరెక్టర్ రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ శుభ్రతకు చర్యలు తీసుకుంటాం

నిజామాబాద్ డిప్యూటీ ఆర్ఎం సరస్వతీ

బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారిణి

బిచ్కుంద, జూన్ 28: బిచ్కుంద ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ డిప్యూటీ ఆర్ఎం సరస్వతీ అన్నారు. బిచ్కుంద బస్టాండ్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. బస్టాండ్ పరిసరాల్లోని వ్యాపారులు వ్యర్థాలను బస్టాండ్ ఆవరణలో వేస్తున్నారని, దీంతో దుర్గంధం వస్తుందని, దుకాణదారులకు నోటీసులు ఇస్తామని తెలిపారు. బస్టాండ్ ఎదురుగా ఖాళీ ప్రదేశంలో దుకాణాల ఏర్పాటు కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సూర్య, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, కంట్రోలర్ అప్పా తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ షుగర్స్‌లో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

రామారెడ్డి, జూన్ 28: సదాశివనగర్‌లోని మర్కల్ వద్ద ఉన్న గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం తలసరి విద్యుత్ వినియోగం బాగా పెరిగిందన్నారు. ఎలక్ట్రికల్ మోటర్లు, చార్జర్లు ఎక్కువగా వినియోగించడంతో ప్రమాదాలు పెరిగాయన్నారు. విద్యుత్ పరికరాలను ఆపరేట్ చేసే సమయంలో సిబ్బంది అన్ని రకాల భద్రతా పరికరాలు వినియోగించాలని సూచించారు. మండే స్వభావం ఉన్న వాటిని విద్యుత్ పరికరాల వద్ద నిల్వ చేయొద్దని తెలిపారు. కార్యక్రమంలో డి.వీరరాజు, కుటుంబరావు, శ్రీనివాస్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

★I, TITLA RAJU S/o. T.GANGADHAR H.No:8-55, చేంగల్, మం॥భీమ్‌గల్, జి॥ నిజామాబాద్ నా పాస్‌పోర్ట్ నెం. B3183236 బైక్ పై చేంగల్ నుండి భీంగల్‌కు వెళ్ళుచుండగా పోయినది. దొరికినవారు సంప్రదించు సెల్: 9989151803

NTZ-324949

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్ర